

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 10 జూన్ 2026 పేజీలు : 04


# ప్రతి ఇంటిని బీఎల్‌ఏలు సమగ్రంగా మ్యాపింగ్ చేయాలి





సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, సమావేశానికి హాజరైన బి ఎల్ ఏ లు.

- పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ సూచన.
- ఎస్ఐఆర్ పై ఆత్మకూరు, అనంత రూరల్ నాయకులకు అవగాహన.
- క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచన.
- ప్రతి ఓటు కీలకమన్న ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్.

**అనంతపురం రూరల్, జూన్ 09 ప్రభాతవార్త**

మరో వారం రోజుల్లో ఎస్ఐఆర్, ప్రక్రియమొదలుకానున్న నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో బీఎల్ఏలు ప్రతి ఇంటిని సమగ్రంగా మ్యాపింగ్ చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాలశ్రీరామ్, సూచించారు. నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల నాయకులకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పించారు. అనంతపురం నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ రోడ్డులోని బి.వి.ఎస్ ఫంక్షన్ హాల్లో ఆత్మకూరు మండల నాయకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతపురం రూరల్ మండల నాయకులకు రాప్తాడులోని టీడీపీ కార్యాలయంలో ఈ సమావేశం నిర్వహించారు. మండల కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లతో పాటు మండల ముఖ్యనాయకులు పాల్గొనగా ఎస్ఐఆర్ పై వారికి ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ దిశానిర్దేశ్యం చేశారు. బీఎల్ఏలు క్షేత్రస్థాయిలో ఎదుర్కొనే పరిస్థితులు, ఓటరు ధృవీకరణ విధానం, కుటుంబ లింకేజీలు, డ్రాఫ్ట్ జాబితా పరిశీలన, అభ్యంతరాల ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి ప్రారంభమవుతుందని.. క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతీ 2025 ఏళ్లకోసారి స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారని చెప్పారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేయాలన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకుని పని చేయాలని సూచిస్తూ పోలింగ్ బూత్ ల వారిగా ఓటర్ జాబితాలను నాయకులకు అందజేశారు.


**మహిళలకు ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులను ఆశ్రయించండి ... 4>>**













## 53 కిలోల గంజాయి పట్టివేత

- నిందితుడు అరెస్టు - కారు, మొబైల్ సీజ్



గంజాయి పట్టివేతపై వివరాలు వెల్లడిస్తున్న డి.ఎస్.పి శివన్నారాయణ, సిఐ శ్రీనివాసులు, ఎస్ఐ సతీష్

**నల్లమాడ జూన్ 9 ప్రభాతవార్త,**

మండల పరిధిలోని పులగంపల్లి వద్ద మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న 53 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణ, సిఐ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నల్లమాడ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ శ్రీనివాసులు మాట్లాడుతూ గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డి.ఎస్.పి శివన్నారాయణ ఆదేశాల మేరకు తమ ఆధ్వర్యంలో నల్లమడ ఎస్సై సతీష్, సిబ్బందితో కలిసి మంగళవారం పులగంపల్లి క్రాస్ లో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేశారు. కదిరి నుంచి ఓడిసి వైపు అనుమానస్పదంగా వెళుతున్న హుండాయ్ ఏపీ 39 ఎన్ఏ 75 07 నెంబరు గల కారును తనిఖీ చేయగా కార్ డిక్కీలో 24 ప్యాకెట్ల లో 53 కిలోల గంజాయి దాచి ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవింగ్ చేస్తూ గంజాయి తరలిస్తున్న నల్లమాడ మండలం సి రెడ్డివారి పల్లికి చెందిన బి వెంకటరమణ ను అదుపులోకి తీసుకొని కారు, మొబైల్ ఫోన్ ను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో సి రెడ్డి వారి పల్లి కి చెందిన మల్లికార్జున ఆదేశాల మేరకు వెంకటరమణ గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నందున తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సిఐ వివరించారు.

## త్వరితగతిన సబ్సిడీ విత్తన వేరుశెనగ పంపిణీకి చర్యలు తీసుకోవాలి



జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్

**అనంతపురం కలెక్టరేట్ జూన్ 09 ప్రభాతవార్త**

ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో త్వరితగతిన సబ్సిడీ విత్తన వేరుశెనగ పంపిణీకి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీపై జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, ఏపీ సీడ్స్ డిఎం, విత్తన సరఫరాదారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు 56,423 క్వింటాళ్ల సబ్సిడీ విత్తన వేరుశనగ కేటాయింపు చేయడం జరిగిందని, అందులో ఇప్పటివరకు 7,092 క్వింటాళ్ల విత్తన వేరుశనగను రైతు సేవ కేంద్రాల్లో అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు. మిగిలిన విత్తన వేరుశనగను రైతు సేవ కేంద్రాలలో అందుబాటులో ఉంచి ప్రజలకు విత్తనాలను పంపిణీ చేసేందుకు త్వరగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల రిజిస్ట్రేషన్ ప్రకారం స్టాక్ పొజిషన్ చేయించాలన్నారు. ఎల్ నినో కారణంగా వీలైనంతవరకు వేరుశనగ పంట విస్తీర్ణం సాగును తగ్గించాలన్నారు. సబ్సిడీ విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక క్వింటాళు సబ్సిడీ విత్తన వేరుశనగకు పూర్తి ధర 10,200 రూపాయలు కాగా, దాంట్లో 40 శాతం సబ్సిడీ అనగా 6,120 రైతు చెల్లించాల్సి ఉంటుందని, 4,080 క్వింటాళుకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తెలిపారు. ఒక రైతుకు గరిష్టంగా 30 కేజీల చొప్పున ఉండే మూడు బస్తాల వితన వేరుశనగను పంపిణీ చేయడం జరుగు తుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సాలురెడ్డి, ఏపీ సీడ్స్ డిఎం సుబ్బయ్య, విత్తన సరఫరాదారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దాం

- స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం - వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత

**అనంతపురం సిటీ, జూన్ 9 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్దామని వైసిపి జిల్లా అద్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో అమలు చేయని హామీలు ప్రజా సమస్యలపై జిల్లా వైసిపి కార్యాలయంలో అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కర్త, జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలను గుప్పించి అధికారంలోకి రాగానే హామీలను అమలు చేయకుండా ప్రజలను వంచిస్తోందన్నారు. గత వైసిపి హయాంలో ప్రజా సంక్షేమం కోసం ప్రవేశ పెట్టిన పథకాలను కూడా ఎత్తివేసి ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ప్రజా సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించు కోకుండా ధనార్జనే ధ్యేయంగా కూటమి నేతలు ప్రజా ధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. కూటమి నేతల అవినీతి, దౌర్జన్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రశ్నిస్తే పోలీసులను అడ్డు పెట్టుకుని అక్రమ కేసులు బనాయిస్తు వైసిపి శ్రేణులను వేదిస్తున్నారని మండి పడ్డారు. కూటమి నేతల బెదిరింపులకు, దౌర్జన్యాలకు ఎవరు భయపడవద్దని పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం పట్ల అన్ని వర్గాల్లోనూ వ్యతిరేకత వ్యక్తం అవుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను వైసిపి పాలన సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు, పార్టీ నేతలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

### కూటమి ప్రభుత్వం ఇచ్చిన

## సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలి

వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషాశ్రీచరణ్ డిమాండ్



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

**పెనుకొండ జూన్ 9 ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణం అమలు చేయాలని జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు పూర్తయిందని మాజీ మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం పెనుకొండ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు పెనుకొండ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతోను, పరిగి మండల వైసిపి నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ చర్చా వేదిక నిర్వహించి నిరసన కార్యక్రమం ఉషశ్రీ చరణ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, వేధింపులు మిన్నంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి, నమ్మించి మోసం చేశారని మండిపడ్డారు. మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను ఎలా వంచించారో వివరించారు. రైతులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చకుండా అన్నదాతల వీపున కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వం చట్టాన్ని, పోలీసు వ్యవస్థను చేతుల్లోకి తీసుకుని, ప్రతిపక్ష నాయకులను, కార్యకర్తలను అక్రమంగా అరెస్టులు చేయిస్తూ కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 50 సంవత్సరాలు దాటిన బీసీలకు పెన్షన్ ఇస్తామని చెప్పి బీసీలను తీవ్రంగా అన్యాయం చేశారు, నిరుద్యోగ భృతి, ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, రైతు భరోసా వంటి ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే పుట్టి స్థాయిలో అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నల్ల బెలూన్లను ఎగురవేసి తమ నిరసనను వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ మాజీ చైర్మన్ పొగాకు రామచంద్ర, వైసీపీ మండల కన్వీనర్ సుధాకర్ రెడ్డి, పట్టణ కన్వీనర్ నరసింహులు, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘోర రోడ్డు ప్రమాదం..

డ్రైవర్ సజీవ దహనం



మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక దళాలు



దగ్ధమవుతున్న లారీలు



సజీవ దహనమైన లారీ డ్రైవర్ (ఫైల్ ఫోటో)

**డి,హీరేహాల్, జూన్ 9 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలం జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద 150 ఎ జాతీయ రహదారి పై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు పూర్తిగా దగ్ధమైన లారీ డ్రైవర్ సజీవ దహనమైన సంఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ బొమ్మనహాల్ ఎస్.ఐ. నబీ రసూల్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటన విష యమై సిఐ అందించిన వివరాల మేరకు ఈ ఘటనలో కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ దీక్షిత్ (32) మంటల్లో చిక్కుకుని సజీవ దహనం కాగా సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ ముత్తురాజ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడని సీఐ చెప్పారు. కర్ణాటక చిత్రదుర్గం నుండి బళ్లారి సమీపంలోని జిందాల్ పరిశ్రమకు కంకరతో వెళుతున్న లారీ, జిందాల్ నుండి బెంగళూరుకు సిమెంట్ ట్యాంకర్ తో వెళ్తున్న లారీ డీజిల్ ట్యాంకును కంకర్ లారీ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుందని సీఐ తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు అందించిన కథనం మేరకు కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్దుర మత్తులో రాంగ్ రూట్ లో వెళ్లి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ డీజిల్ ట్యాంకును గుద్దడంతో ట్యాంకు పగిలి మంటలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాన్ని గమనించిన సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీ ఆపి దిగి పరిగెత్తడంతో ప్రాణాపాయం తప్పి స్వల్ప గాయాలతో బయటపడడం జరిగిందని మంటల్లో సజీవ దహనమైన మరణించిన లారీ డ్రైవర్ కు భార్య, కూతురు ఉన్నారని సీఐ వివరించారు. కంకర్ లారీ డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంతో లారీని నడపడమే ప్రమాదానికి కారణమైందని మంటల్లో సజీవ దహనమైన లారీ డ్రైవర్ కర్ణాటక హిరియూరు సమీపంలోని గౌడనహళ్లికి చెందిన వ్యక్తని సీఐ చెప్తారు. రాయదుర్గం, బళ్లారి అగ్నిమాపక దళాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చారు.

## రెండేళ్లలో రూ.3.5 లక్షల కోట్లు అప్పులు తెచ్చి ఏంచేసారో చెప్పాలి..?!



చర్చా వేదికలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

- -తమ పాలనపట్ల కూటమి పాలకులకే విశ్వాసం లేకుండా పోతోంది
- -ఓట్ల కోసం ఎన్నికల్లో హామీలిచ్చి ప్రజలను నమ్మించి వంచించారు
- -పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం
- -మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి
- -వెన్నుపోటుకు రెండేళ్లుపై ఉరవకొండలో ప్రజా సంఘాల చర్చా వేదిక

**ఉరవకొండ, జూన్ 9 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేవలం రెండేళ్లలో 3.5 లక్షల కోట్ల రూపాయలు అప్పు చేసి ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని మాజీ ఎమ్మెల్యే, ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.బసవరాజు అధ్యక్షతన ప్రజా సంఘాల చర్చా వేదిక కార్యక్రమం జరుగగా ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ తమ పాలనపట్ల కూటమి పాలకుల్లోనే విశ్వాసం లేకుండాపోగా తాము మళ్లీ అధికారంలోకి రామని వారికి అర్థమైపోయిందన్నారు. రాష్ట్రంలో కూటమిది నకిలీ విజయమని ఈవీఎంలపై వచ్చిన సందేహాలను నేటికీ ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారన్నారు. గడిచిన రెండేళ్లలో ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చకుండా అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. పైగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు విపరీతంగా పెరగడంచేత నిత్యవసరాల ధరలు కొండెక్కి సామాన్య ప్రజలు, పంటలకు గిట్టుబాటు ధరలేక రైతుల జీవితాలు దుర్భరమవుతున్నాయన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో 3.5 లక్షల కోట్లు అప్పులు చేసి ప్రజలకు డీబీటీ, నాన్ డీబీటీ కింద 2.5 లక్షల కోట్ల రూపాయలను వివిధ స్కీమ్‌ల ద్వారా పంపిణీ చేయడం జరిగిందన్నారు. వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో విద్య, వైద్యానికి డోకా లేకుండా ఉండేదని నేడు అంతటా వ్యాపారంతప్ప సేవ ఊసే లేకుండా పోయిందన్నారు. జగన్ రాష్ట్రంలోని లక్షలాది మంది పేదలకు ఇంటి స్థలాలు ఇళ్లు ఇచ్చి కొత్త కాలనీలు కాకుండా ఊళ్లనే నిర్మించారని కూటమి ప్రభుత్వం రెండేళ్లలో ఒక్కరికి ఒక సెంటు స్థలం, ఒక ఇళ్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. ఇది పేదల ప్రభుత్వం కాదని ధనికులు, కార్పొరేట్ల ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. కూటమి పెద్దలకు జగన్ భయం పట్టుకుందని అందుకే ఆయన్ను హింసావాదిగా చిత్రీకరించాలని నానా యాతన పడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ రాయలసీమ అధికార ప్రతినిధి కె.వి.రమణ, మేధావుల ఫోరం జిల్లా కార్యదర్శి కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి సి.పి.వీరన్న, పార్టీ ఉరవకొండ అబ్జర్వర్ హావళిగి భరత్‌రెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.సి.ఎర్రిస్వామి, పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షులు బి.యోగేంద్రరెడ్డి, పట్టణ అధ్యక్షులు ఈడిగ ప్రసాద్, రూరల్ మండల అధ్యక్షులు గోళ్ల ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీపీ యం.నరసింహులు, మాజీ జెడ్పీటీసీ ఎస్.తిప్పయ్య, ఎంబీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ జోగి వెంకటేష్, మైనార్టీ విభాగం నాయకులు బి.ఆసీఫ్, బషీర్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు మోపిడి సిద్ధార్థ, చేనేత నాయకులు కరూరు వెంకటేశులు, ఆరే రాజశేఖర్, పచ్చిరవి తదితరులు పాల్గొన్నారు.



చర్చావేదికలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

## విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ పనిచేయని సర్వర్

**పలు పంచాయతీలలో మొదలు పెట్టని రిజిస్ట్రేషన్**

**ఓకే విహెచ్ఏకి మూడు పంచాయతీలు**

**విత్తన వేరుశనగ కోసం రైతుల ఎదురుచూపు**

బ్రహ్మసముద్రం జూన్ 9 ప్రభాతవార్త



విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న రైతులు

మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్లో రైతులకు అందాల్సిన విత్తన వేరుశనగ రైతులకు అందించడంలో అధికారులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు మండల వ్యాప్తంగా వర్షాలు కురవడంతో రైతులు తమ పొలాలను దుక్కి చేసుకుని విత్తన వేరుశనగ కోసం రైతులు ఎదురు చూస్తుంటే ప్రభుత్వం అందించాల్సిన విత్తన వేరుశనగ అందించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు మండలంలోని సంతే కొండాపురం ఎరాడికేరా పడమటి కోడి పల్లి తదితర గ్రామాలకు వీహెచ్ఏలు లేకపోవడంతో పక్కన పంచాయతీల వీహెచ్ఏ లను ఇన్చార్జిలుగా నియమించిన అధికారులు తమ సొంత పంచాయతీలలో వేరుశనగ కోసం రిజిస్ట్రేషన్ చేసుకుందామన్న సర్వర్ పనిచేయకపోవడంతో రైతులు విత్తన వేరుశనగ రిజిస్ట్రేషన్ కోసం గంటల కొద్ది వేచి చూడాల్సిన అవసరం ఉంది సర్వర్ పని చేయక విహెచ్ఎలు రిజిస్ట్రేషన్ చేసుకుంటూ ఉండటంతో ఇన్చార్జి ఇచ్చిన గ్రామాలలో రిజిస్ట్రేషన్ ప్రారంభించక గ్రామాలలో రైతులు అయోమయంలో పడ్డారు వర్షాలు సకాలంలో పడ్డ రైతులకు అందించాల్సిన విత్తన వేరుశనగపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శలు ప్రజల నుండి వినిపిస్తున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు విత్తన వేరుశనగ సకాలంలో అందిస్తారా వేచి చూడాలి.

## సాఫీగా మండల సర్వ సభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మిదేవి

కంబదూరు, జూన్ 9 ,ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ భవనంలో మంగళవారం ఎంపీపీ కురుబ లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వ సభ్య సమావేశం సాఫీగా సాగింది.సమావేశంలో వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను సభ్యులకు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీపీ లక్ష్మీదేవి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మండల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు.సమావేశానికి హాజరైన ఎంపీటీసీ సభ్యులు మండలంలోని డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ప్రస్తావించడంతో పాటు ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.అనంతరం జడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు, వైస్ ఎంపీపీ సోమశేఖర్ మాట్లాడుతూ మండలంలోని వంకలు, నదుల పరివాహక ప్రాంతాల్లో చెట్లను నరికి అక్రమంగా బొగ్గు వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు లేకుండా బొగ్గు వ్యాపారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులను కోరారు.అలాగే సాకలి రేవు సమీపంలో ఆక్రమణలకు గురైన కాలువలను పునరుద్ధరించి యథావిధిగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సమావేశంలో తహశీల్దార్ బాలకిషన్, ఎంపీడీవో సూర్యనారాయణ, అడ్మినిస్ట్రేషన్ అధికారి తిప్పయ్యతో పాటు వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## యూరియా డిఏపీ లను ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారానే విక్రయాలు జరపాలి

**కళ్యాణదుర్గం ఏ డి ఏ ఎల్లప్ప**

కళ్యాణదుర్గం రూరల్ జూన్ 9 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న ఏ డి ఏ ఎల్లప్ప

యూరియా, డీఏపీ ఎరువుల పారదర్శక పంపిణీ కోసం ఏపీ ఏఐఎంఎస్ యాప్ ను ప్రభుత్వం రూపొందించిందని దాని ద్వారా తప్పనిసరి గా విక్రయాలు జరపాలని కళ్యాణదుర్గం ఏడిఏ ఎల్లప్ప పేర్కొన్నారు ఆయన మంగళవారం స్థానిక మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లు తదితర సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఖరీఫ్ సీజన్ నుండి యూరియా, డీఏపీ ఎరువుల విక్రయాలను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించేందుకు ఏపీ ఏ ఐ ఎం ఎస్ 2.0 యాప్ ను ప్రభుత్వం తప్పనిసరి చేసిందని ఎరువులు పక్కదారి పట్టకుండా నేరుగా అర్హులైన రైతులకు మాత్రమే సబ్సిడీ ఎరువులు అందేలా వ్యవసాయ శాఖ ఈ సరికొత్త యాప్ ద్వారా డిజిటల్ విధానాన్ని అమలులోకి తెచ్చిందని వివరించారు. పారిశ్రామిక అవసరాలకు ఎరువుల అక్రమ రవాణాను అరికట్టడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.డీలర్లకు వివరించిన ముఖ్యమైన మార్గదర్శకాలు మరియు యాప్ పనితీరు. ఆధార్ మరియు ఈపంట అనుసంధానం: రైతులు తమ 12 అంకెల ఆధార్ నంబర్ ఆధారంగా రిజిస్టర్ చేసుకోవాలి. యాప్ వెబ్‌ల్యాండ్ మరియు ఈపంట రికార్డులతో అనుసంధానించబడి ఉంటుంది.కోటా నిర్ధారణ: రైతు సాగు చేస్తున్న పంట విస్తీర్ణాన్ని బట్టి సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా వారికి అవసరమైన యూరియా, డీఏపీ పరిమాణాన్ని విడతల వారీగా లెక్కిస్తుంది. అథెంటికేషన్ నిర్ధారించిన కోటా ప్రకారం, రైతు ఎంచుకున్న డీలర్ వద్దకు వచ్చి తన రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు వచ్చే ఓటిపి ని సమర్పించి ఎరువులను కొనుగోలు చేయవచ్చునని తెలిపారు. రైతులకు నచ్చిన దుకాణంలో కొనుగోలు: రైతులు తమకు కేటాయించిన ఎరువుల కోటాను తమకు నచ్చిన అధీకృత రిటైల్ డీలర్ వద్ద పొందే వెసులుబాటు ఉంది.ఈ శిక్షణలో డీలర్లకు యాప్ లాగిన్ విధానం, స్టాక్ నమోదు, మరియు సేల్స్ ట్రాన్సాక్షన్ ప్రక్రియపై లైవ్ డెమో ద్వారా పూర్తి అవగాహన కల్పించారు. నిబంధనలు ఉల్లంఘించి పాత పద్ధతిలో విక్రయాలు జరిపినా లేదా ఎరువుల కృత్రిమ కొరత సృష్టించినా డీలర్లపై చట్టపరమైన మరియు క్రిమినల్ చర్యలు ఉంటాయన్నారు. రైతులందరూ తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా లేదా వ్యవసాయ అసిస్టెంట్ల సహాయంతో యాప్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు మరియు కళ్యాణదుర్గం మండల పరిధిలోని ఎరువుల వ్యాపారులు పాల్గొన్నారు.

## నేడు టిడిపి ముఖ్యనాయకుల సమావేశం

అమరాపురం జూన్ 9ప్రబాతవార్త



కన్వీనర్,ప్రదానకార్యదర్శి దృశ్యం

అమరాపురం మండల తెలుగు దేశం పార్టీ కుటుంబ సభ్యులు బుదువారం ఉదయం 11 గంటలకు తెలుగుదేశం పార్టీ ఆఫీస్ నందు సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుంది కావున తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వివిధ హోదాలో ఉన్న ముఖ్య నాయకులు క్లస్టర్ కో క్లస్టర్ పంచాయతీ కన్వీనర్లు యూనిట్ ఇన్చార్జులు బూత్ కన్వీనర్ లు ప్రతి ఒక్కరూ సమావేశానికి హాజరు కావలసిందిగా వారు తెలిపారు.

## వసతి గృహం పిలుస్తోంది రా కార్యక్రమానికి శ్రీకారం

**పేద విద్యార్థులు ప్రభుత్వ హాస్టళ్లలో చేరాలని అధికారులు పిలుపు**

కంబదూరు, జూన్ 9 ,ప్రభాతవార్త



వసతి గృహం పిలుస్తోంది పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న అధికారులు

జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో పేద విద్యార్థులకు ప్రభుత్వ వసతి గృహాల సదుపాయాలను చేరువ చేయాలనే ఉద్దేశంతో వసతి గృహం పిలుస్తోంది రా కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ అధికారి నాగరాజు తెలిపారు. కంబదూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న ప్రభుత్వ బాలుర వసతి గృహంలో సీట్ల భర్తీకి ప్రవేశాల దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆయన మంగళవారం వెల్లడించారు.అర్హత కలిగిన పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని హాస్టల్లో ప్రవేశం పొందాలని కోరారు.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ కురుబ లక్ష్మీదేవమ్మ, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, తహసీల్దార్ బాలకిషన్, ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ సోమశేఖర్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. వారు సంయుక్తంగా ఖివసతి గృహం పిలుస్తోంది రాఖి కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్ ను ఆవిష్కరించారు. ప్రభుత్వ హాస్టళ్లలో అందిస్తున్న సౌకర్యాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచిత వసతి, భోజనం, విద్యా సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అర్హులైన విద్యార్థులు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పెట్రోల్, డీజిల్ ధరలపై వామపక్ష పార్టీల కన్నెర్ర..!!

**-హనుమాన్ సర్కిల్‌లో భారీఎత్తున రాస్తారోకో**

**-ఎక్సైజ్ సుంకం వ్యాట్ 50 శాతం తగ్గించాలని డిమాండ్**




కార్యక్రమంలో మాట్లాడుతున్న వామపక్ష పార్టీల నాయకులు

గుంతకల్లు, జూన్ 9 ప్రభాతవార్త



రాస్తారోకోతో స్తంభించిన ట్రాఫిక్

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలపై వామపక్ష పార్టీలు కన్నెర్రజేశాయి. మంగళవారం హనుమాన్ సర్కిల్‌లో భారీఎత్తున రాస్తారోకో చేపట్టారు. దీంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రాస్తారోకోకు సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, సీపీఎం నాయకులు సురేంద్ర, ఐఎఫ్‌టీయు పట్టణ కార్యదర్శి రాందాస్ అధ్యక్షత వహించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్రస్వామి, సిపిఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి సురేష్, సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత మూడు నెలల కాలంలోనే 4 సార్లు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై పెనుభారం మోపిందని మండిపడ్డారు. నిత్యావసర సరుకుల ధరలతో పాటు గ్యాస్ ధరలు పెరగడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎక్సైజ్ సుంకం వ్యాట్లను 50 శాతం తగ్గించాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తెచ్చి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మహేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి వైస్ ప్రెసిడెంట్ ఫిరోజ్‌ఖాన్, సీపీఐ నాయకులు మురళీకృష్ణ, దాసరి శ్రీనివాసులు, వెంకటనాయక్, కుల్లాయప్ప, సురేష్, ఈశ్వరయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు జిలాన్, సత్తార్, రామాంజనేయులు, సాయి, నారాయణ, బాష, రామచంద్ర, పాల్గొన్నారు.

## ఇంధనం ధరల పెంపు పట్ల వామపక్షాల ధర్నా




వామపక్షాలు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, జూన్ 9 ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక గాంధీ చౌక్ వద్ద మంగళవారం వామపక్షాలు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంధనం ధరలు పెంపు వలన పరోక్షంగా నిత్యావసరవస్తువుల ధరలపై ప్రభావం చూపి ప్రజలకు అదనపు భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులకు రాయితీలు ఇస్తున్న కేంద్రం సామాన్య ప్రజానీకానికి నడ్డి విరిచే రీతిన ధరలు పెంచుతోందని విమర్శించారు. సిలిండర్లు కట్టెలతో వారు తమ నిరసన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు రంగప్రవేశం చేసి కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యదర్శి రామదాసు, సిపిఎం కార్యదర్శి నిర్మల, వామపక్షాల నాయకులు రాజు, నజీర్, మహమ్మద్, మధు, రేణుక, రామకృష్ణ, మల్లేష్, మల్లికార్జున, రమేష్, నవీన్‌యాదవ్, చందు, ఊర్మిళ, డేనియల్, రామకృష్ణ, షఫీ, శివ, గోపాల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మనిషి నిజ జీవితంలో యోగా ఒక భాగం కావాలి

**-మాధవరాయస్వామి ఆలయం ఆవరణలో యోగాసానాలు**

గోరంట్ల, జూన్ 9 ప్రభాతవార్త



యోగ కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

గోరంట్ల మాధవ రాయుని ఆలయం ఆవరణంలో మంగళ వారం సిద్ధ సమాధి యోగా గురువు సురేష్, ప్రిన్సిపల్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ భక్తవత్సలం ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులు గోరంట్ల మండల ఎంపిడిఓ కమలాబాయి నేతృత్వంలో దాదాపు 100 మందికి పైగా పాల్గొని యోగాసానాలు వేశారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ కమలాబాయి మాట్లాడుతూ ఆరోగ్యం, ఆహారం, సరైన ఆలోచనా విధానం, సరిపడేంత నిద్ర మనిషి జీవితంలో ఉన్నతంగా జీవించడానికి నాలుగు పిల్లర్లు అని అలాగే ఎంత సంపాదించినా ఆరోగ్యం సరిగా లేకపోతే ప్రయోజనం లేదన్నారు. కనుక ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యం కోసం కనీసం రోజూ ఒక గంట అయినా కేటాయించుకుని మంచి ఆరోగ్యాన్ని పొందాలని తెలియజేసారు. యోగా గురువు సురేష్ యోగ సాధన చేయించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీసత్యసాయి జిల్లా శాఖ వైస్ చైర్మన్ భక్తవత్సలం మాట్లాడుతూ మనిషి నిజ జీవితంలో యోగా ఒక భాగం కావాలని ప్రతి ఒక్కరూ ఉదయం లేవగానే ప్రాణాయామం, ఆసనాలు, ధ్యానం అలవాటు చేసుకోవాలన్నారు. అలాగే యోగా యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఆయుష్ డాక్టర్ సునీత మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాకుండా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే జీవన విధానమని పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రజలు, యువత, మహిళలు, రెడ్ క్రాస్ సభ్యులు, ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో పాల్గొని యోగా సాధన చేశారు. పాల్గొన్న వారందరూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకొని ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని ఈ సందర్భంగా వారు పిలుపునిచ్చారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాలే కాకుండా సమాజంలో సానుకూల దృక్పథం, క్రమశిక్షణ మరియు సామరస్య భావన పెంపొందుతాయన్నారు. యోగా పట్ల ప్రజల్లో మరింత అవగాహన, చైతన్యం కలిగించడంతో పాటు ఆరోగ్యవంతమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి అందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బాధితుడికి వేణురెడ్డి పరామర్శ

హిందూపురం జూన్ 9 ప్రభాతవార్త



పరామర్శిస్తున్న వేణు రెడ్డి

హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న వైఎస్ఆర్సిపి నాయకులు ఆదినారాయణ రెడ్డిని వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు గుడ్డంపల్లి వేణురెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా గుడ్డంపల్లి వేణురెడ్డి మాట్లాడుతూ హిందూపురం శాంతికి మారు పేరు, అశాంతి పురంగా టిడిపి నాయకులు మారుస్తున్నారని మండిపడ్డారు. నిన్నటి రోజున చిలమత్తూరు మండలం కొడికొండ గ్రామ సమీప పొలంలో పనిచేస్తున్న వైఎస్ఆర్సిపి నాయకులు కొడికొండ రామచంద్రారెడ్డి సోదరుడు ఆదినారాయణ రెడ్డి, రత్నమ్మ దంపతుల పై దాడి చేసిన టిడిపి బీసీ సెల్ అధ్యక్షుడు గాండ్ల బాలాజీ అనుచరుల పై వెంటనే పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వీటన్నింటినీ ప్రజలందరూ గమనిస్తున్నారు త్వరలోనే గట్టిగా బుద్ధి చెప్తారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రజలకు అందుబాటులో ఉండి ఇక్కడ ఓట్లు వేసి గెలిపించిన పురం బాగోగులను పట్టించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నియోజకవర్గ మండల గ్రామ వార్డు అధ్యక్షులు, నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లేపాక్షి మండలంలో ఇంటింటి సర్వేపై అవగాహన

**-15 నుంచి క్షేత్రస్థాయిలో ప్రక్రియ ప్రారంభం**

లేపాక్షి, జూన్ 9 ప్రభాతవార్త




మాట్లాడుతున్న తహశీల్దార్ సౌజన్యలక్ష్మి



హాజరైన బిఎల్ఓలు

ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం. అలాంటి ఓటు హక్కును కోల్పోకుండా ఉండాలంటే, ఎన్నికల సంఘం చేపట్టిన తాజా సర్వేలో ఓటర్లు భాగస్వాములు కావాలని తహశీల్దార్ సౌజన్య లక్ష్మి సూచించారు. లేపాక్షి మండలంలో ఇంటింటి ఓటర్ల సర్వే పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. మంగళవారం స్థానిక నీలం సంజీవరెడ్డి ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బూత్ స్థాయి అధికారులు, సూపర్ వైజర్లకు సర్వేపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. జూన్ 15వ తేదీ నుంచి మండల వ్యాప్తంగా బిఎల్ఓలు ఇంటింటికి రానున్నారు. వీరు 2025 ఓటర్ల జాబితా ఆధారంగా ప్రతి ఇంటికి రెండు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారు. ఓటర్లు తమ ఆధార్‌తో పాటు 2002 నాటి ఓటర్ల జాబితాలోని వివరాలను సరిచూసుకోవాలన్నారు.

**మాపింగ్ వివరాలు :** ఓటరు పేరు, తల్లి/తండ్రి/తాత/నానమ్మ పేర్లను 2002 నాటి రికార్డులతో సరిపోల్చుతూ ఫారంలో నింపాలని, ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారంపై తాజా కలర్ ఫోటోను తప్పనిసరిగా అతికించాలన్నారు. నింపిన రెండు ఫారాల్లో ఒకటి బిఎల్ఓకు అందచేసి రెండో కాపీని రశీదుగా తమ వద్దే ఉంచుకోవాలన్నారు.

**వివాహిత మహిళలకు ప్రత్యేక సూచన :** 2002 తర్వాత వివాహం చేసుకుని ఇతర ప్రాంతాల నుంచి లేపాక్షి మండలానికి వచ్చిన మహిళలు, తమ పుట్టింటి వారినుంచి తండ్రి ఓటర్‌ఐడీ వివరాలనుసేకరించి బిఎల్ఓలకు అందించాలన్నారు. అప్పుడే వారి వివరాలు మ్యాపింగ్ అవుతాయన్నారు.

**ఫారం ఇవ్వకుంటే జాబితాలో ఉండరు :** ఎన్యుమరేషన్ ఫారం సకాలంలో నింపి ఇవ్వని వారి పేర్లు రాబోయే ముసాయిదా ఓటర్ల జాబితాలో ఉండవని కాబట్టి ఓటర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించి అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలోఉండేలా చూడాలని తహశీల్దార్ స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో హిందూపురంనియోజకవర్గం ఎన్నికల డిప్యూటీతహశీల్దార్ మహేష్, ఎన్నికల ఆపరేటర్లు సురేష్, అశోక్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ ధరల పెంపుపై సిపిఐ నిరస



ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన చేపడుతున్న సిపిఐ నాయకులు

కళ్యాణదుర్గం టౌన్, జూన్ 9 ప్రభాతవార్త

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల ను విపరీతంగా పెంచి సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని సీపీఐ కళ్యాణదుర్గం నియోజకవర్గ కార్యదర్శి గోపాల్ విమర్శించారు. మంగళవారం ఏఐటీ యూసీ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం టీసర్కిల్ వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల సంక్షేమాన్ని పక్కనపెట్టి కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆరోపించారు.గ్యాస్ సిలిండర్, పెట్రోల్, డీజిల్‌ధరల పెరుగుదలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు కూడా భారీగా పెరగడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు రాయితీలు ఇస్తూ, ప్రజలపై పన్నుల భారం మోపడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని గోపాల్ పేర్కొన్నారు.ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు నరసింహులు, అంజి, బుడెన్, లక్ష్మీదేవి, ఏఐటీయూసీ నాయకుడు నాగేంద్రతో పాటు కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్‌లో బోనస్‌గా ప్రజలకు డబుల్ కష్టాలు..!

**-పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెరుగుదలపై సీపీఐ, సీపీఎం రాస్తారోకో**

**-ప్రజల కష్టాలు కూటమి పాలకులకు పట్టడంలేదని నాయకుల విమర్శ**

**-ధరలు తగ్గించి పేద, సామాన్యుపై భారం తొలగించాలని డిమాండ్**



ఉరవకొండలోని కవితా హోటల్ సర్కిలో నిర్వహించిన వామపక్షాల రాస్తారోకో దృశ్యం

ఉరవకొండ, జూన్ 9 ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్రాల్లో డబుల్ ఇంజన్ సర్కార్ల కారణంగా ప్రజలకు డబుల్ కష్టాలు బోనస్‌గా లభిస్తున్నాయని వామపక్ష పార్టీల నాయకులు ధ్వజమెత్తారు. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల పెరుగుదలను నిరసిస్తూ మంగళవారం ఉరవకొండ పట్టణంలోని కవితా హోటల్ కూడలిలో సీపీఐ, సీపీఎం పార్టీలు ప్రధాన రహదారిపై బైటాయించి పెద్దఎత్తున రాస్తారోకో



వాహనాలు నిలిచిపోయి స్తంభించిన ట్రాఫిక్

నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాలకులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.కేశవరెడ్డి, సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.కృష్ణమూర్తి, పార్టీ డివిజినల్ కార్యదర్శి ఎ.రంగారెడ్డి, మండల కార్యదర్శి ఎన్.మధుసూదన్, సీపీఐ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఎం.బి.చెన్నరాయుడు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ పశ్చిమాసియాలో యుద్ధం ఉద్రిక్తతలను బూచిగా చూపి కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్యులపై మోయలేని భారం మోపుతోందన్నారు. అంతర్జాతీయంగా క్రూడ్ ఆయిల్ ధరలు తగ్గిన క్రమంలో ఏనాడూ ధరలు తగ్గించని కేంద్రం పెరిగినపుడు మాత్రం ప్రజలపై భారం మోపుతోందని మండిపడ్డారు. పెట్రో ధరల పెరుగుదల కారణంగా నిత్యవసరాలు, కూరగాయలు ఇలా అన్ని ధరలు విపరీతంగా పెరిగిపోయి పేద, మధ్యతరగతి ప్రజల జీవనం దినదిన గండంగా మారుతోందన్నారు. కింద, పైన డబుల్ ఇంజన్ సర్కార్లు ఉంటే అభివృద్ధి, సంక్షేమ పరుగులు పెడుతుందని చెప్పి ఇప్పుడు ధరల భారం మోపుతూ ప్రజల జీవితాలను ఛిద్రం చేస్తున్నారన్నారు. కార్పొరేట్లకు కొమ్ముకాచే ప్రధాని నరేంద్రమోదీ వారి సంక్షేమం గురించి ఆలోచించడం కాస్త మానుకొని ప్రజల బాగోగులు పట్టించుకోవాలని హితవు పలికారు. మోదీ, అమిత్‌షాకు రాష్ట్రాల్లో ఎలా పాగావేసి తమ గుప్పెట్లో పెట్టుకొని అక్కడ అధికారంలోకి రావాలన్న ఆలోచనలు తప్ప ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనే లేదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మోదీ చేతిలో కీలుబొమ్మగా మారి పెట్రో ఉత్పత్తులపై సుంకాలు వసూళు చేస్తూ ఖజానా నింపుకొంటున్నారుతప్ప భారం తగ్గించేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. లక్షల కోట్ల అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పాంధ్రప్రదేశ్‌గా మార్చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష పార్టీల నాయకులు బసవరాజు, శీనప్ప, నాగేంద్ర, ఖాజీంధర్, మురళీ, మల్లేసి తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కార్యకర్తలకు ఎనేబుల్ స్క్రీనింగ్ శిక్షణ

బెలుగుప్ప జూన్ 9 ప్రభాతవార్త



అంగన్వాడి కార్యకర్తలకు ఎనేబుల్ స్క్రీనింగ్ ద్వారా శిక్షణ ఇస్తున్న దృశ్యం

శిశువు పుట్టిన ప్పటి నుండి ఆరు సంవత్సరం వరకు గల పిల్లలు లో అభివృద్ధి చేసే దిశగా అంగన్వాడి కార్యకర్తలను శిక్షణ కార్యక్రమం. నిర్వహించడం జరిగిందినీ డాక్టరు ప్రియాంక సీడీపీవో డాక్టరు బి శ్రీదేవీ తెలిపారు సీడీపీవో శ్రీదేవి మండల కేంద్రంలో జడ్పీ హై స్కూల్ లో జూన్ 9తేదిన శిక్షణ కార్యక్రమాన్నిని. నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో డాక్టరు శ్రీదేవి డాక్టరు ప్రియాంక మాట్లాడుతూ ప్రతి చిన్నారికి జీవితంలో అద్భుతమ ఆరంభాన్ని అందించడం కోసం బిడ్డ తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచే స్టిములేషన్ ప్రారంభించాలి అని అన్నారు బిడ్డ పుట్టినప్పటినుంచి మూడు సంవత్సరాల వరకు అభివృద్ధి దశలో ఆలస్యాలను వెంటనే గుర్తించాలి. ఈ విధంగా గుర్తించిన విషయాలను సాంకేతికంగా పోనీ యాప్ ద్వారా పొందుపరిచి అలస్యాలను పిల్లలు అధిగమించేలా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే విధంగా మిగతా సాధారణ పిల్లలతో పాటుగా తన జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకునే విధంగా చేయడం కోసం ఈ యాప్ యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు ప్రతి బిడ్డకు తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి రెండు సంవత్సరాల వయసు వచ్చేవరకు గల వెయ్యి రోజుల చిన్నారి భవిష్యత్తుకు అత్యంత కీలకమైనది కావున బిడ్డ మూడ సంవత్సరాలు వయసు వరకు నిధుడు 80 అభివృద్ధి చెందుతుంది ఆరు సంవత్సరాల వయసు వచ్చేవరకు 90 మెదడు అభివృద్ధి జరుగుతుంది కావున ఈ సమయంలో వారి అభివృద్ధి అలస్యాలను వెంటనే గుర్తించగలిగినట్లయితే వారిని మంచి ఆరోగ్యకరమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి కనుక బిడ్డకు పోషక ఆహారం ఆరోగ్యం స్పందనాత్మక సంరక్షణ ప్రారంభించి అభ్యసన అవకాశాలు భద్రతా ప్రేరణ ఇవ్వడం ద్వారా పిల్లలు భవిష్యత్తును వారి శ్రేయస్సును తీర్చిదిద్దడానికి అవకాశం ఉంటుంది ఈ విషయాలన్నింటిపై అంగనవాడి కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రమాదేవి అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంతర్జాతీయ లెవల్ క్రాసింగ్ అవగాహన దినోత్సవం



భద్రతా కరపత్రాల పంపిణీ సిన రైల్వే అధికారులు.

గుంతకల్ రైల్వే జూన్ 09 ప్రభాతవార్త

గుంతకల్ రైల్వే డివిజనల్‌లో అంతర్జాతీయ లెవల్ క్రాసింగ్ అవగాహన దినోత్సవం ( ఐఎల్‌సిఏడి )-2026 సందర్భంగా, రైల్వే భద్రతా బృందం తాడిపత్రి–చల్లవాటిపల్లె విభాగంలోని లెవల్ క్రాసింగ్ నెం. 159 160 వద్ద భద్రతా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భద్రతా అధికారులు మరియు సిబ్బంది ప్రారంభమైన హైస్పీడ్ ఆటోమేటిక్ డబుల్ లైన్ విభాగంలో రైళ్లు గంటకు 130 కి.మీ. వేగంతో నడుస్తాయని, అలాగే ఏదిశనుంచైనా రైలురావచ్చని రహదారివినియోగదారులకు వివరించారు. ముఖ్యంగా గేటు మూసి ఉన్నప్పుడు, రైలు కనిపించకపోయి నా లెవల్ క్రాసింగ్ దాటేందుకు ప్రయత్నించవద్దు. గేటు పూర్తిగా తెరవబడిన తర్వాత మాత్రమే దాటాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో భద్రతా కరపత్రాల పంపిణీ చేసారు ప్రజలతో ప్రత్యక్షంగా చర్చలు, భద్రతా సూచనలు మరియు కౌన్సెలింగ్ నిర్వహించారు. లెవల్ క్రాసింగ్‌ల వద్ద భద్రత ప్రాణాలను కాపాడుతుందన్నారు. సురక్షితమైన రైల్వే వాతావరణం కోసం మనమందరం కలిసి కృషి చేద్దాం అని రైల్వే అధికారులు ప్రయాణికుల కు తెలిపారు.

# మహిళలకు ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులను ఆశ్రయించండి

**- మహిళల భద్రత పోలీసుల బాధ్యత - జిల్లా ఎస్‌పి జగదీష్**



మాట్లాడుతున్న జిల్లా ఎస్‌పి జగదీష్


హాజరైన మహిళలు

**పుట్లూరు, జూన్ 9 ప్రభాతవార్త**

మహిళలు, చిన్నారులకు ఎలాంటి సమస్య తలెత్తినా పోలీసులను ఆశ్రయించాలని, వారికి భద్రత కల్పించడం పోలీసుల బాధ్యతని జిల్లా ఎస్‌పి జగదీష్ పేర్కొన్నారు. పుట్లూరు మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయం సమీపంలోని వ్యవసాయశాఖ గోదాములో మంగళవారం మహిళల భద్రత, రక్షణ అంశాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్‌పి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలపై జరుగుతున్న గృహహింస, వేధింపులు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్, స్త్రీరక్ష పోర్టల్ సేవలు, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నెంబర్లు, పోలీస్ శాఖ అందిస్తున్న సేవల గురించి వివరించారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని, ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితులకు బ్యాంకు ఖాతా వివరాలు, వ్యక్తిగత సమాచారాన్ని ఇవ్వకూడదన్నారు. పోక్సో చట్టం, ఆస్తి హక్కులు, బాల్య వివాహాల నిషేధం వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించారు. గంజాయి, తదితర మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను ఎస్‌పి వివరిస్తూ యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు సురక్షిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతకు కట్టుబడి ఉందని, అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 112 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్‌పి తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పి ఎస్.మహబూబ్‌బాషా, పుట్లూరు సిఐ సత్యబాబు, యల్లనూరు, పుట్లూరు ఎస్ఐలు రామాంజనేయరెడ్డి, సురేంద్రబాబు, మహిళలు, జిఎంఎస్‌కే సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకం

**- చెడు అలవాట్లకు దూరంగా ఉండండి - సన్మార్గంలో నడిచి ఉన్నత స్థాయికి ఎదగండి**

**- గొడవలకు దూరంగా ఉండండి - చెన్నేకొత్తపల్లి క్రికెట్ టోర్నమెంట్ ముగింపు వేడుకలో జిల్లా ఎస్పీ**





క్రీడల్లో పాల్గొన్న వారికి ట్రోఫీలను అందజేస్తున్న జిల్లా ఎస్పీ




**చెన్నేకొత్తపల్లి, జూన్ 9 ప్రభాతవార్త**

యువత దేశ, సమాజ అభివృద్ధికి ప్రధాన శక్తిగా నిలవాలని, ఉన్నత లక్ష్యాలతో కృషి చేస్తే ఏ రంగంలోనైనా విజయాన్ని సాధించవచ్చని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పేర్కొన్నారు. రామగిరి పోలీస్ సర్కిల్ పరిధిలోని చెన్నేకొత్తపల్లిలో గత 15 రోజులుగా నిర్వహించిన అంతర్ మండల క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ యువతను ఉద్దేశించి ప్రసంగించారు. యువకులు తమ జీవిత లక్ష్యాలపై స్పష్టమైన దృష్టి పెట్టి క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యంగా 20 నుండి 22 సంవత్సరాల వయస్సు భవిష్యత్‌ను నిర్మించుకునే కీలక దశ అని, ఆ సమయంలో తీసుకునే నిర్ణయాలే జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తాయని వివరించారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం ఎన్నో త్యాగాలు చేస్తుంటారని, వారి ఆశయాలను సాకారం చేయడం ప్రతి యువకుడి బాధ్యత అని తెలిపారు. గంజాయి, మద్యం, పొగాకు వంటి వ్యసనాలు వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా కుటుంబాలను కూడా దెబ్బతీస్తాయని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు బానిసలైన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. బాలికలు, మహిళల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలన్నారు. లైంగిక వేధింపులు, దాడులపై అమలులో ఉన్న పోక్సో చట్టం కఠిన నిబంధనలను యువతకు వివరించారు. సమాజంలో సత్ప్రవర్తనతో జీవించే వారితో పోలీసులు ఎల్లప్పుడూ స్నేహపూర్వకంగా ఉంటారని, అయితే చట్టాన్ని ఉల్లంఘించే వారి పట్ల రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామాలలో అందరూ కలిసిమెలిసి ఉండాలని ఉద్దేశంతో రామగిరి సర్కిల్ పోలీసులు ఆధ్వర్యంలో ఇటువంటి క్రీడలు నిర్వహించామని, ప్రతి ఒక్కరూ ఎటువంటి గొడవలకు వెళ్లకుండా కలిసిమెలిసి జీవించాలని సూచించారు. కులాలు, మతాలు, రాజకీయాల పేరుతో యువత వేరు కావద్దని, సమాజ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో ముఖ్యమైనదని తెలియజేశారు. కులమత రాజకీయాలకు అతీతంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. క్రికెట్‌లో చిన్న వయస్సులోనే ప్రతిభ కనబరుస్తున్న యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీని ఉదాహరణగా ప్రస్తావిస్తూ, పట్టుదల, అంకితభావం, నిరంతర సాధన విజయానికి పునాది అని వివరించారు. శాంతి భద్రతల పరిరక్షణలో యువత పోలీసులకు సహకరించాలని సూచించారు. యువతలో సానుకూల దృక్పథం పెంపొందించేందుకు నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలాలకు చెందిన సుమారు 60 జట్లు పాల్గొనడం సంతోషకరమని తెలిపారు. రామగిరి సర్కిల్ సీఐ మహమ్మద్ అలీ, ఎస్సైలు సత్యనారాయణ, రిజ్వాన్, ప్రదీప్, స్థానిక ప్రజలు, క్రీడాకారులు, నిర్వాహకులు, పోలీసు సిబ్బంది అందించిన సహకారంతో టోర్నమెంట్ విజయవంతంగా పూర్తయిందని అభినందించారు. తాను యువకుడిగా క్రికెట్ ఆడిన రోజుల జ్ఞాపకాలు ఈ సందర్భంగా గుర్తుకొచ్చాయని ఎస్పీ పేర్కొంటూ, క్రీడల అభివృద్ధికి తోడ్పడుతున్న ప్రాంత ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

**గెలుపొందిన జట్లకు నగదు, ట్రోఫీలు అందజేసిన జిల్లా ఎస్పీ :**

టోర్నమెంట్‌లో మేడాపురం జట్టు మొదటి స్థానం సాధించి రూ.40,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందుకుంది. రెండవ స్థానం సాధించిన సికేపల్లి యూత్ జట్టుకు రూ.30,000 నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. మూడవస్థానం పొందిన తూముచెర్ల గ్రామ జట్టుకు రూ.20,000 నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. నాలుగో స్థానంలో నిలిచిన రామగిరి సర్కిల్ పోలీస్‌జట్టుకు రూ.10,000 నగదు బహుమతి, ట్రోఫీ అందజేశారు. అదేవిధంగా ఈ టోర్నీలో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ నరేష్, బెస్ట్ బౌలర్ కానిస్టేబుల్ బాలాజీ నాయక్, బెస్ట్ బ్యాట్స్‌మన్ చందులకు ట్రోఫీలు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రామగిరి సీఐ మహమ్మద్ అలీ, ఎస్ఐలు సత్యనారాయణ, రిజ్వాన్, ప్రదీప్, మూడు మండలాలకు చెందిన యువ క్రీడాకారులు, క్రీడాభిమానులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

# వజ్రోత్సవ హాకీ టోర్నీ ప్రారంభోత్సవ వేడుకలకు కలెక్టర్ , జెసిలకు ఆహ్వానం


కలెక్టర్, జెసిలకు ఆహ్వాన పత్రాలు అందిస్తున్న హాకీ అసోసియేషన్ ప్రతినిధులు




**శ్రీ సత్య సాయి జిల్లా, జూన్ 09, ప్రభాతవార్త ప్రతినిధి**

ధర్మవరంలో హాకీ ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ ఛాంపియన్ షిప్ 75 సంవత్సరాల వజ్రోత్సవ వేడుకల సందర్భంగా, ఈ నెల 12 నుండి 15 వరకు ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో "స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ ఛాంపియన్ షిప్ 2026" పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ లను హాకీ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రాలను అందజేశారు. కలెక్టర్, జాయింట్ కలెక్టర్లను కలిసిన వారిలో హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బి. సూర్య ప్రకాష్, శ్రీ సత్యసాయి జిల్లా హాకీ వైస్ ప్రెసిడెంట్ బి. గౌరీ ప్రసాద్, ట్రెజరర్ జి. అంజన్న, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్, హాకీ కోచ్ ఎస్. హుస్సేన్ తదితరులు ఉన్నారు.

# తిరుపతి వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి సవిత

వెంకటేశ్వరస్వామి సన్నిధిలో మంత్రి సవిత



**పెనుకొండ జూన్ 9 ప్రభాతవార్త**

తిరుమలలో వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వరస్వామిని మంత్రి సవిత మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న మంత్రి సవితకి ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు.దర్శనానంతరం వేద పండితులు మంత్రి కి వేద ఆశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు, అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి జిల్లా కురుబ సంఘం అధ్యక్షులు మాజీ సర్పంచ్ అశ్వర్థనారాయణ, రవి, గోల్డ్ షాప్ రఘు, తదితరులు పాల్గొన్నారు.

# మొహారం పండుగకు చెట్లు నరకకుండా చూడాలి

## జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

**పుట్టపర్తి (కలెక్టరేట్), జూన్ 09, ప్రభాతవార్త**


జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

మొహారం పండుగ సందర్భంగా చెట్లు నరకకుండా చూడాలని సంబంధిత అధికారులకు శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మొహారం పండుగ సందర్భంగా ప్రజలు పలు సూచనలు పాటించాలని కలెక్టర్ ఒక ప్రకటనలో సూచించారు. మొక్కలను, చెట్లును, వృక్షములను కాపాడుకోవడం మన బాధ్యత. చెట్ల వల్ల మనం పీల్చే ప్రాణవాయువు ఆక్సిజన్ అందిస్తాయి. వీటిని కాపాడటం అంటే మన ఉనికి మనం కాపాడుకావడమే అన్నారు. చెట్లు లేకపోతే ఎన్నో జీవరాసులు అంతరించి పోతాయనీ, ఇది చివరకు పర్యావరణ చక్రం దెబ్బ తినడానికి దారితీస్తుందని, ప్రకృతిని మనం కాపాడితే ప్రకృతి మన్నని ఆపదల నుండి కాపాడుతుందన్నారు. మన సంప్రాదయ వేప, రావి, జువ్వి, మర్రి, జమ్మి, వృక్షలను నరకడం వల్ల రాబోయే 2030 సంవత్సరములు పర్యావరణ దుష్ప్రభావాలను ఎదుర్కోవలసి వస్తుందన్నారు. గ్రామాల పొలిమేరలలో పెరిగిన సర్కార్ జాలి (కంపచెట్లు) మొద్దులను (వేరు మండలం) తీసి అగ్ని గుండములో వేయాలన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా మొహారం జరిగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ, అటవీ అధికారులు, ఎండోమెంట్ అధికారులు, ఇతర శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

# నిషేధిత జాబితా నుంచి భూమి తొలగింపు

## రైతు సమస్యకు కలెక్టర్ తక్షణ పరిష్కారం

**పుట్టపర్తి , జూన్ 9, ప్రభాతవార్త**


రైతు మల్లేశప్పను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్

గోరంట్ల మండలం బూదిలి కురుబ మల్లెశప్ప అనే రైతు తన సర్వే నంబరు 476లో ఉన్న 3.30 ఎకరాల భూమిని సెక్షన్ 22ఏ (1)(ఇ) నిషేధిత జాబితా నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు. రైతు విజ్ఞప్తిపై స్పందించిన జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యను పరిశీలించి పరిష్కరించారు. అనంతరం సంబంధిత భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసి అర్జీదారునికి అందజేశారు. ఈ సందర్భంగా రైతు కురుబ మల్లెశప్ప జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేయడానికి శాలువా, పూలహారం వేసి సన్మానించేందుకు ప్రయత్నిం చగా, కలెక్టర్ స్వయంగా రైతును శాలువాతో సన్మానించి ఉత్తర్వుల ప్రతిని అందజేశారు.తన సమస్య పరిష్కారమైనందుకు ఆనందం వ్యక్తం చేసిన రైతు, పి జి ఆర్ ఎస్ ద్వారా సమర్పించిన అర్జీని అధికారులు సత్వరంగా పరిష్కరించి, ఎన్నో రోజులుగా పెండింగ్‌లో ఉన్న భూ వివాదాన్ని నివృత్తి చేసి, తన భూమిని నిషేధిత జాబితా నుంచి తొలగించినందుకు జిల్లా కలెక్టర్‌కు జాయింట్ కలెక్టర్కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గోరంట్లపల్లిలో పోతులయ్య స్వామి జాతరకు హాజరైన మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి

**కొత్త చెరువు: జూన్ 9 ప్రభాతవార్త**

కొత్తచెరువు మండలం గోరంట్లపల్లిలో నిర్వహించిన శ్రీ పోతులయ్య స్వామి జాతర మహోత్సవాలకు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గోరంట్ల పల్లి లో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బులుగుండ్ల శ్రీనివాసులు ఆయన కుటుంబ సభ్యులు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి కి స్వాగతం పలికి అనంతరం పూలమాలలు వేసి శాలువాతో సత్కరించారు ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించి, ప్రాంత ప్రజలుసుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, పంటల సమృద్ధి కోసం ప్రార్థించారు. జాతరకు వచ్చిన భక్తులతో కలిసి ఉత్సవాల్లో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు,రాష్ట్ర డైరెక్టర్ యశోదా రాయుడు , టీడీపీ కన్వీనర్లు రామకృష్ణ ,మల్లి రెడ్డి, , కాంట్రాక్ట్ లక్ష్మీనారాయణ , బైరాపురం మాజీ సర్పంచ్ రవి కొత్తచెరువు టైలర్ కొండప్ప స్టోర్ డీలర్లు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# సంపద సృష్టిస్తామని చెప్పి రోజుకు రూ.523 కోట్లు అప్పులు తెస్తున్నారు..!

**-మంత్రి కేశవ్ కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులపై నిజాలు వెల్లడించాలి**

**-సూపర్-6 హామీల్లో నిరుద్యోగ భృతి, అడబిడ్డ నిధి అమలు ఎప్పుడో చెప్పాలి**

**-నియోజకవర్గంలో తాగునీటి సమస్య మంత్రికు ఎందుకు కనబడటం లేదో**

**-విలేఖరులతో రాష్ట్ర శాసన మండలి సభ్యులు వై.శివరామిరెడ్డి ధ్వజం**


రాష్ట్ర శాసన మండలి సభ్యులు వై.శివరామిరెడ్డి

**ఉరవకొండ, జూన్ 9 ప్రభాతవార్త**

సంపద సృష్టించి ప్రజలకు పంచుతామని చెప్పిన ముఖ్యమంత్రి చం ద్రబాబునాయుడు రోజుకు 523 కోట్ల రూపాయలు అప్పులుచేసి రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి వాపోయారు. మంగళవారం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ గత ప్రభుత్వంలో విధ్వంసం జరిగిందని గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అంటూ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రం లో ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేం దుకు గత ప్రభుత్వ పాలన విధ్వంసం అంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ అంటూ పొడిచిన వెన్నుపోటు ప్రజలకు అర్థమైందన్నారు. వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ టీడీపీ పార్టీ అన్నారు. సూపర్ సిక్స్‌లోని నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి హామీలు ఏమయ్యాయో మంత్రి ప్రజలకు చెప్పాలన్నారు. రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు, భూదందాలు, దౌర్జన్యాలు అధికమయ్యాయని వాటిని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. పోలీస్ స్టేషన్లు పంచాయతీలకు కేంద్రంగా మారాయన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య బద్ధంగా పాలనకు బదులు నియంతృత్వ పోకడలతో ప్రజలు విసుగెత్తిపోతున్నారని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి విమర్శించారు. ముఖ్యమంత్రి మెప్పుకోసం ఆర్థిక మంత్రి పాకులాడుతున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిలో అవినీతి నిజం కాదా అని ప్రశ్నించిన ఎమ్మెల్సీ కేవలం అమరావతి ప్లాన్ కోసమే 400 కోట్ల రూపాయలు తగలేయడం ఏ రకమైన పాలనో చెప్పాలన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ సీటీ అని చెప్పి వేల కోట్ల అప్పులకు గ్యారెంటీ ఎందకిస్తున్నారో వివరించాలన్నారు. విద్యార్థుల విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలే 10,000 కోట్ల రూపాయలు ఉండగా పట్టించుకోవడం లేదని, ఆరోగ్యశ్రీ బకాయిలు 2,600 కోట్ల రూపాయలు చెల్లించలేదన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని గణాంకాలే చెబుతున్నాయని ఆయన మండిపడ్డారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు విధ్వంసాలు, కుట్రలు చేసే వారికి అంత మోసపూరితంగానే కనబడుతుందని విమర్శించారు. గత పాలనపై ఆర్థిక మంత్రి అవాకులు చవాకులు పేలితే సహించబోమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పేర్కొన్నారు.

# రాబోయేది జగన్ ప్రభుత్వమే..

**రాప్తాడులో గెలిచేది వైసీపీయే.చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు సదస్సులో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి**





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి. - సమావేశానికి హాజరైన నాయకులు.

**అనంతపురం రూరల్, జూన్ 09 ప్రభాతవార్త**

దోచుకునేందుకే పరిటాల కుటుంబం అధికారాన్ని ఉపయోగించుకుంటోందనే విషయం నియోజకవర్గ ప్రజలకు అందరికీ అర్థమైంది. పరిటాల కుటుంబం ఒక్కో దెబ్బ కొడుతుంటే ప్రజలు బయటకు వస్తున్నారు. వాడుంటే (ప్రకాష్‌రెడ్డి) మేలు. మళ్లీ వాడే రావాలి అని చర్చించుకుంటున్నారు. రాప్తాడు మనదే. ప్రజలంతా మనవైపే ఉన్నారు అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్ల కార్యక్రమంలో భాగంగా రాప్తాడు నియోజకవర్గ సదస్సు మంగళవారం కళ్యాణదుర్గం రోడ్డులోని బీ.జీ.ఆర్ ఫంక్షన్ హాలులో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యంగా రాప్తాడు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.నియోజకవర్గంలో పరిటాల కుటుంబం చేస్తున్న దుర్మార్గాలపై ప్రచారం జరగడం లేదన్నారు. మనం చేస్తున్న మంచిపైనా ప్రచారం జరగడం లేదన్నారు. పార్టీ శ్రేణులు ఇప్పటికైనా కళ్లు తెరవండి. మేల్కొని ప్రజల్లో విస్తృతంగా తిరిగి అవగాహన కల్పించాలనిపిలుపునిచ్చారు.రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు మోపడం, అక్రమ వసూళ్లు చేయడం, భూములపై వివాదాలు సష్టించడం అధికార పార్టీ నాయకుల ప్రధాన కార్యక్రమంగా మారింది. ఎమ్మెల్యే పరిటాల సునీత అండతో పాపంపేటలో ఇళ్ల కూల్చివేతలు, భూముల రిజిస్ట్రేషన్లలో అవకతవకలు జరిగాయి. ఇళ్లు కట్టుకున్న వాళ్ల జోలికి పోమ్మని చెప్పడం చూస్తుంటే ప్రజలను భయపెట్టే రాజకీయాలు చేస్తున్నారనేది అర్థమైంది. మహిళలకు నెలకు రూ.1,500 ఇవ్వలేదు. ఉచిత గ్యాస్ హామీ అమలు కాలేదు. జగనన్న పేదలకు అమలు చేసిన ఆసరా, చేయూత, సున్నా వడ్డీ వంటి పథకాలు నిలిచిపోయాయి. బస్సుల్లో ఉచిత ప్రయాణం పేరుతో మిగతా హామీలన్నీ మరిచిపోయారు.జగన్ ప్రభుత్వ హయాంలో రైతులకు అందిన పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల సౌకర్యాలు ఇప్పుడు కనిపించడం లేదు. పంట నష్టపోతే అదే సీజన్‌లో సాయం అందే పరిస్థితి ఉండేది, ప్రస్తుతం రైతులు పూర్తిగానిరాశలోఉన్నారు.హంద్రి-నీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ చేయడంవల్ల భూగర్భజలాలు తగ్గిపోయాయని, రాప్తాడు,ఆత్మకూరు, కనగానపల్లి, పుట్టపర్తి, కదిరి ప్రాంతాల్లో వేలాదిబోర్లుఎండిపోయాయి. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీరు అందించే పైపులైన్ పనులను రాజకీయ కారణాలతో అడ్డుకున్నారు. ఆత్మకూరు వరకు 90 శాతం, అక్కడి నుంచి పాపంపేట దాకా 60 శాతం పైపులైను పనులు పూర్తయినా మిగిలిన పనులు నిలిచిపోయాయి. నాఅజెండా నాయకులకు నచ్చకపోవచ్చు ప్రజలకు నచ్చుతుందని వైసీపీ కార్యకర్తలు సోషల్ మీడియా, ప్రెస్‌మీట్లు, గ్రామస్థాయి ప్రచారం ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. గ్రామ కమిటీలు మరింత చురుకుగా పని చేయాలని,రాష్ట్రంలో ప్రజలు ఇప్పటికే ప్రభుత్వంపై విసుగు చెందారు. పంచాయతీ ఎన్నికల నుంచి వచ్చే అన్ని ఎన్నికల్లో వైసీపీ విజయం సాధిస్తుందని ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.'కాబోయే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి. రాప్తాడులో గెలిచేది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీయే.ఫ్యాన్ మళ్లీ గిరగిరా తిరుగుతుందిరెండు సంవత్సరాల టీడీపీ పాలన ప్రజలకు వెన్నుపోటు, వంచన,విద్రోహం,వినాశనాన్ని మాత్రమే మిగిల్చింది ఈనెల 12 న నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, జడ్పిటిసి లు, ఎంపీటీసీలు, కన్వీనర్లు, మాజీ సర్పంచులు, అధిక సంఖ్యలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్ని శాఖల అధికారుల సమన్వయంతో యోగాంధ్రను జయప్రదం చేద్దాం

**- అధికారుల సమీక్ష సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్**


అధికారుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

**కదిరి, జూన్ 9 ప్రభాతవార్త**

కదిరి పట్టణంలోని శ్రీమత్‌ఖాద్రి లక్ష్మినరసింహస్వామి దేవస్థాన తూర్పు గోపురం వద్ద నేడు (బుధవారం) తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ యోగాంధ్ర ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ.. యోగాంధ్ర నిర్వహించే ప్రాంగణంలో పారిశుద్ధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని, తాగునీటి సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, భద్రతను పర్యవేక్షించాలని సూచించారు. ఎటువంటి అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సందీప్, తహశీల్దారు రెడ్డి శేఖర్, ఆలయ ఈఓ శ్రీనివాస్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.